క్లుప్తంగా

నేడు 5కే-రన్

తుక్కుగూడ: ఓటు హక్కు వినియోగం, పోలింగ్ శాతం పెంచేందుకుగాను ఓటర్లకు అవగాహన కల్పించేందుకు బుధవారం ఉదయం 7గంటలకు 5కే-రన్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రాం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రన్ అయ్యప్ప స్వామి ఆలయం నుంచి ఇమామ్‌గూడ వరకు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, ఎంపీడీఓ, మున్సిపల్, పోలీస్, మెప్మా జిల్లా, మండల స్థాయి అధికారులు, సిబ్బంది హాజరవుతారని చెప్పారు.

పరామర్శ

కందుకూరు: మండల పరిధిలోని ముచ్చర్లకు చెందిన బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు దేరంగుల మోహన్ తల్లి లక్ష్మమ్మ ఇటీవల మరణించింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సబితా రెడ్డి మంగళవారం గ్రామానికి వచ్చి మోహన్ కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నీటి సమస్యల ఫిర్యాదుకు టోల్‌ఫ్రీ నంబర్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో నీటి సమస్య ఫిర్యాదుల కోసం మున్సిపల్ అధికారులు టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఏ బస్తీలో నీటి సమస్య ఉన్నా అధికారుల దృష్టికి తీసుకొస్తే, సమస్య సులువుగా పరిష్కారం అవుతుందని కమిషనర్ వాణి రెడ్డి అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు టోల్ ఫ్రీ నంబర్(7330 8773 93)ను అందుబాటులోకి తెచ్చామని, 24/7 ఈ నంబర్‌కు సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

ప్రత్యేక బృందం

మీర్‌పేట: వేసవి దృష్ట్యా కార్పొరేషన్ పరిధిలోని కాలనీలు, బస్తీలలో నీటి సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేకంగా అధికారుల బృందాన్ని నియమించినట్లు కమిషనర్ బి.చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే మేనేజర్ ఎస్.వెంకట్‌రెడ్డి-8555060216, ఏఈ బి.శ్రీనివాసులు-7331189484, డీఈ పి.వెంకన్న-8555870616, ఏఈ మహిపాల్-390059384 నంబ ఫిర్యాదు చేయవచ్చని, 24 గంటలు అధికారులు అందుబాటులో ఉంటారని చెప్పారు.

చలివేంద్రం ప్రారంభం

బడంగ్‌పేట్: చలి వేంద్రాలు మానవుల దాహర్తిని తీరుస్తాయని మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం ఆమె కార్పొరేషన్ పరిధిలోని పాత గ్రామ పంచాయతీ సర్కిల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద లైఫ్ హెల్త్ డయాగ్నోస్టిక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. అన్ని దానాలల్లో నీటి దానం గొప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, బాలకృష్ణ, నిర్వాహకులు మహేశ్‌రెడ్డి, ఆనంద్, ఆకాస్ మెడికల్స్ నిర్వాహకులు పసునూరు సత్యనారాయణ, మురళి, కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నరసింహ స్వామి ఆలయంలో పూజలు



పూజలో పాల్గొన్న సచ్చిదానంద సరస్వతి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి గాయత్రినగర్‌లోని శారదా లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ షష్ఠమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం శంకరాచార్య శ్రీ స్వయంప్రకాశ సచ్చిదానంద సరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, భక్తులు ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ పూజలో స్థానిక నాయకులు చల్లా బాల్‌రెడ్డి, ఆలయ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, కార్యనిర్వాహణాధికారి డాక్టర్ రవిశంకర్, ముఖ్య కార్యదర్శి బి రాజేశ్వర్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, హరిబాబు, వెంకటేశ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వార్షిక వేడుకలు



యజ్ఞం చేయిస్తున్న పూజారులు

తుక్కుగూడ: రావిర్యాల సూర్యగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా పూజలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉత్సవాల్లో భాగంగా ఆలయంలోని శ్రీలక్ష్మీనరసింహ ఆంజనేయ స్వామి విగ్రహాలతో పాటు శివునికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. యజ్ఞయాగాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, కౌన్సిలర్ సుమన్, పూజారులు, భక్తులు, పాల్గొన్నారు.

ఆ రహదారి గుంతలమయం



గూడూరు నుంచి లేమూరు చౌరస్తా మధ్యలో ఏర్పడ్డ గుంత



అధ్వానంగా తయారైన రహదారి

- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

కందుకూరు: గ్రామాల అభివృద్ధి జరగాలంటే రహదారులు సక్రమంగా ఉండాలి. కానీ ఆ రహదారులు అధ్వానంగా మారితే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. గ్రామాల్లో అక్కడక్కడ రోడ్లు సక్రమంగా లేకపోవడంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంలో పట్టించుకునే వారు కరువయ్యారు. మండల పరిధిలోని గూడూరు గ్రామం నుంచి లేమూరు గ్రామానికి వెళ్లే రహదారి అడుగడుగునా గుంతలుగా తయారైంది. దీంతో ఈ దారిగుండా వాహనాలు వెళ్లలేని దుస్థితి దాపురించింది. పలు గ్రామాలను కలిపే లింకు రహదారి ఇలా తయారైతే సంబంధిత అధికారులకు మాత్రం ఏమి తెలియనట్లు వ్యవహరించడం బాధాకరం.

మూడు కిలోమీటర్ల మేర..

గూడూరు గ్రామం నుంచి లేమూరు చౌరస్తా వరకు సుమారు మూడు కిలోమీటర్ల వరకు నిర్మించి ఏళ్లు గడుస్తున్నాయి. ప్రస్తుతం ఆ రహదారి అధ్వానంగా మారింది. అడుగు అడుగునా గుంతలతో ఇబ్బందికరంగా ఉంది. దీంతో ఒక్క గూడూరు గ్రామస్తులకే కాదు పలు గ్రామాల ప్రజలకు తిప్పలు తప్పడంలేదు. లేమూరు, రాచులూరు, బేగంపేట, తిమ్మాపూర్, సరస్వతిగూడ, అగర్‌మియాగూడ తదితర గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి చేరుకోవడానికి ఇదే దారి గుండా వెళ్లాలి. మరోపక్క అన్నోజిగూడ, తిమ్మాయిపల్లి, కటికపల్లి, మాలగూడూరు తదితర గ్రామాల ప్రజలు హైదరాబాద్‌వైపు వెళ్లడానికి ఆ దారే సౌకర్యవంతంగా ఉంటుంది. ప్రస్తుతం ఆ రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడంలేదు. రాత్రి వేళలో ఆ గుంతలను సరిగ్గా అంచనా వేయలేక ప్రమాదాల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నిధులు మంజూరు చేయించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

టెండర్లు పిలిచి పనులు చేయిస్తాం

గూడూరు నుంచి లేమూరు చౌరస్తా వరకు గుంతల మరమ్మతులు చేయడానికి రూ.23లక్షలు మంజూరయ్యాయి. టెండర్ పిలిచినా ఎవరూ ముందుకు రాలేదు. ఎన్నికల తర్వాత మరోసారి టెండర్ పిలిచి పనులు చేయిస్తాము.

– సతీష్‌రెడ్డి, ఏఈఈ పీఆర్, కందుకూరు

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కల్వకోల్ గ్రామంలో చౌడమ్మ తల్లి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పురాతనమైన ఆలయాలను పున నిర్మాణం చేపట్టి విగ్రహాలను ప్రతిష్ఠించడం అభినందనీయమన్నారు. ఆనాడు మన పెద్దలు నిర్మాణం చేసిన గ్రామ దేవతల ఆలయాలను గుర్తించి పునఃనిర్మాణం చేసి పూజలు నిర్వహించడం శుభప్రదమన్నారు. ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని భక్తి భావం, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేటాయిస్తే ప్రశాంతంగా ఉండొచ్చన్నారు. ప్రజలందరినీ అమ్మవారు ఆయురారోగ్యాలతో చల్లగా చూడాలని ప్రార్థించారు. అంతకు ముందు గ్రామంలోని చౌడమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు యాదవులు, భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజలనంతరం ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్, కల్వకోల్ ఎంపీటీసీ తొంట స్వప్న రవీందర్, మాజీ సర్పంచ్‌లు గాదె థామస్‌రెడ్డి, మల్లమ్మ, బీఆర్‌ఎస్ సీనీయర్ నాయకుడు సుధాకర్‌రెడ్డి, అంబయ్య యాదవ్, పర్వతాలు గౌడ్, వెంకటేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దేవరశెట్టి చంద్రశేఖర్, విజేందర్‌రెడ్డి

కందుకూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, వైస్ చైర్మన్ గోపిరెడ్డి విజేందర్ రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, తాము పండించిన ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రానికి తెచ్చి విక్రయించాలన్నారు. వరి క్వింటాళ్లు ఏ గ్రేడ్ రకానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 మద్దతు ధర చొప్పున కొనుగోలు చేయనున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని లబ్ధి పొందాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సురసాని శేఖర్‌రెడ్డి, నర్ల నర్సింహా, తీగల జగదీశ్వర్‌రెడ్డి, సత్తినేని వెంకటరాంరెడ్డి, సాధ పాండు రంగారెడ్డి, రైతులు బక్క యాదయ్య, బక్క సత్తయ్య, లాడె అంజయ్య, సీఈఓ నిమ్మ యాదగిరి రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు



తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయానికి భక్తులు బారులు తీరారు. మంగళవారం అమ్మవారికి ప్రీతియైన రోజు కావడంతో భక్తులు ఉదయం నుంచే దర్శనానికి బారులు తీరారు. ప్రత్యేక పూజల అనంతరం బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సత్యనారాయణ స్వామి వ్రతం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, పూజారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు అందరి బాధ్యత

ఆర్డీఓ వెంకట మాధవరావు

షాద్‌నగర్: ఓటు హక్కు అందరి బాధ్యత అని ఆర్డీఓ వెంకట మాధవరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని మినీ స్టేడియం నుంచి ముఖ్య కూడలి వరకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమంలో భాగంగా 5కే రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్డీఓ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం సజావుగా సాగాలంటే ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగం అందరికీ ఓటు హక్కును కల్పించిందన్నారు. ఓటు హక్కు వజ్రాయుధం లాంటిందని పేర్కొన్నారు. ప్రజలు విశ్వాసంతో, ప్రలోభాలకు లొంగకుండా, ఒత్తిడికి లోనవకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా పట్టణ చౌరస్తాలో మానవహారాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకన్న, తహసీల్దార్ పార్థసారథి, అసిస్టెంట్ ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి: కమిషనర్ శ్రీనివాస్

చేవెళ్ల: ప్రజాస్వామ్యంలో ఓటు విలువ వెలకట్టలేనిదని, ఓటుహక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. శంకర్‌పల్లి మున్సిపల్ కేంద్రంలో మంగళవారం ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు లోక్‌సభ ఎన్నికలు-2024 స్వీప్‌లో భాగంగా ఓటు ఫర్ షురూ అనే థీమ్‌తో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం నుంచి మార్కెట్ రోడ్డు ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని చెప్పారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాల్సిందేనని చెప్పారు. రాజ్యాంగం ప్రకారం ఓటరు భాగస్వామ్యంతోనే ప్రజాస్వామ్యం నడుస్తోందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఓటరు జాబితాను పరిశీలించుకొని ఏమైనా తప్పులు పొరపాట్లు ఉంటే కూడా సరి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేందర్, ఎండీఓ వెంకయ్యగౌడ్, ఇన్‌స్పెక్టర్ ఎండీ అబిబుల్లాఖాన్, మేనేజర్ అంజన్‌కుమార్, ఏపీఓ నాగభూషణం, మున్సిపల్ కార్యాలయం సిబ్బంది, మెప్మా ఆర్‌పీఎస్ గ్రూప్ సభ్యులు, స్కూల్ విద్యార్థులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్యలో కుదరని సయోధ్య



గొడవకు దిగిన మహిళలు

కొందుర్గు: మండల మహిళా సమాఖ్యలో ఐకేపీ సిబ్బందికి, లీడర్ల మధ్య సయోధ్య కుదరడం లేదు. ఈ సందర్భంగా మంగళవారం మహిళా సమాఖ్య కార్యాలయంలోనే ఒకరిపై ఒకరు గొడవకు దిగారు. కొందుర్గు గ్రామానికి చెందిన చామంతి స్వయం సహాయక సంఘ సభ్యురాలు పరిమళ రూ.50వేలు రుణం కావాలని కోరడంతో సంఘం సభ్యులు సంఘంలో చర్చించి ఆమెకు రుణం ఇచ్చేందుకు తీర్మానం చేశారు. అయితే పరిమళకు రుణం ఇచ్చేందుకు గ్రామైక్య సంఘంలోనూ చర్చ జరిపి గ్రామ సంఘం తీర్మానంపై గ్రామైక్య సంఘం లీడర్లు, సీసీ సంతకం చేసి రుణం కోసం బ్యాంక్‌కు పంపాల్సి ఉంటుంది. కానీ గ్రామ సంఘం లీడర్ భారతమ్మ, సీసీ సరళ మధ్య సయోధ్య కుదరక పోవడంతో పరిమళకు సంబంధించిన రుణం మంజూరులో జాప్యం జరిగింది. ఈ విషయమై ఇటు సరళ, అటు భారతమ్మ మంగళవారం మండల మహిళా సమాఖ్యలో గొడవకు దిగారు. వీరి ఇరువురి మధ్య సయోధ్య కుదరకపోవడంతో సభ్యులు ఇబ్బంది పడుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌కు ఘన నివాళి



మీర్‌పేట: చందన చెరువు కట్టపై పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళి



కొత్తగూడ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

కందుకూరు: బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని గౌడ సంఘం నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు కొత్తగూడ చౌరస్తా సమీపంలో ఏర్పాటు చేసిన పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా గౌడ సంఘం మండల అధ్యక్షుడు అనేగొని పాండుగౌడ్ మాట్లడుతూ 16వ శతాబ్దంలోనే పాపన్నగౌడ్ తన స్నేహితులతో కలిసి గొరిల్లా సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని అప్పటి మొఘల్ సామ్రాజ్యంపై పోరాటం చేశాడన్నారు. గోల్కొండ కోటతో పాటు ఎన్నో కోటలను స్వాధీనం చేసుకుని పాలన చేశాడన్నారు. ఆ మహనీయుడి స్ఫూర్తితో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రమేష్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, సురేష్‌గౌడ్, రాగుల పాండుగౌడ్, ఇంద్రకంటి రవీందర్‌గౌడ్, యుగంధర్‌గౌడ్, దేవేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీరాములుగౌడ్ పాల్గొన్నారు.

మీర్‌పేటలో..

మీర్‌పేట: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని కార్పొరేషన్ అధికారులు అధికారికంగా నిర్వహించకపోవడం బడుగు, బలహీన వర్గాలను అవమానించినట్లేనని మాజీ ఎంపీటీసీ బొబ్బిలి కిరణ్‌గౌడ్ అన్నారు. మీర్‌పేట చందన చెరువు కట్టపై ఉన్న విగ్రహానికి స్థానిక గౌడ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కిరణ్‌గౌడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పాపన్నగౌడ్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని జీవో జారీ చేసిన విషయం గుర్తు చేశారు. అయినప్పటికీ అధికారులు చేయకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతస్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భిక్షపతిగౌడ్, సుర్వి మల్లేష్, కుంటల అనిల్‌గౌడ్, అయితగోని యాదగిరిగౌడ్, సుర్వి శేఖర్‌గౌడ్, రాహుల్‌గౌడ్, బద్దం అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునఃనిర్మాణానికి రూ.2లక్షల విరాళం



చెక్కు అందజేస్తున్న మాజీ సర్పంచ్ మమత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో పురాతన అభయాంజనేయ స్వామి ఆలయ పునఃనిర్మాణానికి మాజీ సర్పంచ్, మాజీ కౌన్సిలర్ యెల్చెల మమత సుదర్శన్ రెడ్డి రూ.2.11లక్షల విరాళం అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆలయాభివృద్ధికి సహరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మర్రి నరసింహారెడ్డి, బండి స్వామి యాదవ్, తిరుపల్లి సుధాకర్‌యాదవ్, కోటగిరి జంగయ్య, అంకంగారి శివగౌడ్, దండు ఐలేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఈటలను కలిసిన పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి



ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను మంగళవారం పాలమూరు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి వెళ్లిన విష్ణువర్ధన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఉన్న ఈటల రాజేందర్‌ను కలిసి శాలువా కప్పి సన్మానించారు. లోక్‌సభ ఎన్నికల్లో పాలమూరు ఎంపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపునకు అందరూ కృషి చేయాలని విష్ణువర్ధన్‌రెడ్డికి ఆయన సూచించారు.

లేఅవుట్ ధ్వంసంపై ఫిర్యాదు



మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీడీఎస్ అసోసియేషన్ సభ్యులు

చేవెళ్ల: బీడీఎల్ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులకు సంబంధించిన లేఅవుట్‌ను ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని అసోషియేషన్ సభ్యులు, ప్లాట్ల యజమానులు డిమాండ్ చేశారు. శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు మంగళవారం వారు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శంకర్‌పల్లిలోని సర్వే నెంబర్లు 208 నుంచి 213 వరకు, 242, 243 సర్వే నెంబర్లలో 18 ఎకరాల 38 గుంటల భూమిని 2011 సంవత్సరంలో బీడీఎల్ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇందులో 2013వ సంవత్సరంలో హెచ్‌ఎండీఏ నుంచి అనుమతి పొంది లేఅవుట్ చేసినట్లు చెప్పారు. లేఅవుట్ చేసిన కొన్ని సంవత్సరాల తరువాత సర్వే నెంబర్ 242 పార్ట్‌లోని మూడు ఎకరాల భూమి తనది అంటూ బీడీఎల్ వెల్ఫేర్ అసోషియేషన్‌కు సంబంధం లేని వ్యక్తులు వచ్చి తమను ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. ఈనెల 1వ తేదీన తోట శ్రీనివాస్‌రెడ్డి అతని అనుచరులతో లేఅవుట్‌లో గల పార్కు స్థలం, డ్రైనేజీ పైపులు, ప్లాట్ చుట్టూ నిర్మించిన ప్రహరీ, బీటీరోడ్లను జేసీబీ సాయంతో ధ్వంసం చేసినట్లు చెప్పారు. అంతేకాకుండా ప్లాట్ల చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు ప్రయత్నిస్తుండగా మాకు తెలియడంతో పోలీసుల సాయంతో వెళ్లి అడ్డుకున్నామన్నారు. ఆ వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న వెంకటరమణ, మల్లేశ్

ఆమనగల్లు: రాష్ట్రంలో వడ్డెరుల ఆర్థికాభివృద్ధి కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని జిల్లా వడ్డెరసంఘం అధ్యక్షుడు వెంకటరమణ, మండల అధ్యక్షుడు గండికోట మల్లేశ్‌లు కోరారు. వివిధ కులాలకు సంబంధించి 16 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ప్రభుత్వం వడ్డెరులను విస్మరించడం సరైంది కాదన్నారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని వడ్డెరసంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ వారు ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం వెంకటరమణ, గండికోట మల్లేశ్‌లు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్‌పార్టీ వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందని వారు గుర్తుచేశారు. రాష్ట్రంలో పాలకులు మారుతున్నప్పటికీ వడ్డెరల జీవితాలు మాత్రం మారడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ వడ్డెరుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్, శంకర్, శ్రీనివాస్, గణేశ్, మురళి, ఆంజనేయులు, గోవింద్, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386